కాబోయే భర్తకోసం
బంగారు కలలు కన్న
ఆమె కోరిక
ఫలించిందా?

గంటి
వెంకటరమణ
కథ


# అంతిమ నిర్ణయం

నిజానికి నేరమంతా అమలమీద రుద్దడం బాగుండదు. అయినా తప్పదు. చిన్నప్పటినుంచీ మగరాయుడిలా పెరిగిందేమో పదహారేళ్ళు వచ్చినా ఆ పోకడలు మార్చుకోలేదు. నలుగురూ ఏమంటారో అన్న బెరుకూ, భయం కొంచెంకూడా లేవు. పట్టపగలు నట్టనడివీధిలో స్నేహితుడు కనిపిస్తే 'హలో' ' అని చేయిచాపి చేతిలో చేయివేసి కొంచెం దూరం వరకూ అతనితో నడుస్తూంటే దానికి చుట్టూవున్నవాళ్లు ముక్కుమీద వేలేసుకుంటే వాళ్ళని చూసి నవ్వుకునేది. వాళ్ళందరూ అమల దృష్టిలో అజ్ఞానులు.

పోనీ తల్లీ తండ్రీ అయినా భయభక్తుల్తో పెంచారా అంటే అదీ లేదు. తల్లికీ తండ్రికీ ఆ పిల్లంటే అంత ముద్దు మరి. తండ్రి కూడా గర్వంగా 'మా అమలలో బొత్తిగా ఆడపిల్లల కుండాల్సిన పిరికితనం మాత్రం లేదు. తలవొంచి నడవాలని చెపితే 'తలవొంపులైన పని నేనేం చేశానని' చెబుతుంది' అంటూండేవాడు. అసలీ అమల సగం ఆయనవల్లే చెడిపోయిందని ఇరుగూ పొరుగూ చెవులు కొరుక్కునేవాళ్ళు.

అలా నిర్భయంగా పెరిగిన అమల అనుకోకుండా ఓ దుష్ట ఘడియలో మనసు పారేసుకుంది. అంతవరకూ భయం బెంగా లేని ఆ పిల్లకి ఆ క్షణంలో కదలిన భయానికి నిలువెల్లా వణికిపోయింది. ఆకతాయితనంగా ఎన్నెన్నో ఉత్తరాలు రాసి పక్కింటి సోముకి అందించింది.

ఆ సోముకూడా అమలతో బాటే పెరిగి ఆ వాతావరణంలోనే పెద్దవాడయ్యాడు. గొప్ప చదువు చదివించే తాహతు సోము




తండ్రికి వుందిగానీ మగరాయుడిలా పెంచిన అమల తండ్రికి లేకపోయింది.

అప్పుడు సంబంధాలు వెతకాలని విశ్వప్రయత్నం చేశాడు. కానీ సోము అప్పటికే అమల రాసిన తీయని వుత్తరాలు నలుగురికీ చూపించాడు. అదో సరదా అనుకున్నాడే మోగానీ వగుబాటు చేస్తున్నాననుకుని ఉండడు.

సోము రాసిన ఉత్తరాలు కట్టలు కట్టలుగా అమల దగ్గర పడివున్నాయి. అయితే వాటిని చూపిస్తే తనూ కసితీర్చుకోవచ్చు అనుకుంది. అంతే ఇరుగింట్లో పొరుగింట్లో చూపించింది. అమల పని అరిటాకు సామెత అయింది.

ఘొల్లున నవ్వారందరూ. సోము బండి ఎక్కుతుంటే అమల అతన్ని ప్రాధేయపడింది. 'అందరూ నన్నుచూసి నవ్వుతున్నారు సోమూ. నన్ను నవ్వులపాలు చేయకు'

'అయితే ఇప్పుడేం చెయ్యమంటావు?' ఖస్సుమన్నాడు అతను.

'ఏమో తెలియడం లేదు'

అతను చేతికున్న గడియారంవైపు చూసుకున్నాడు. రైలు కూత వేసింది. అమల ప్లాట్ ఫారంమీద నిశ్చేష్టురాలై వుండిపోయింది. అంతవరకూ పెళ్ళివారిల్లులా కిటకిటలాడిన ప్రదేశం పందిరి తీసేసినట్లు కళావిహీనంగా మారిపోయింది. చుట్టూ వున్న వెలితి అమల మనసు నిండినంత అయింది. ఆ లోటు భర్తీచేసేందుకు సోము లేదు.

చిన్న విషయమే అయినా ఆ నోటా ఆ నోటా పాకి చివరికి అమలకీ సోముకీ అక్రమ సంబంధం అంటగట్టింది. అంతటితో ఆగకుండా అబార్షన్ కూడా అయినట్లు ద్రువపరిచారు. మొదట్లో ఈ మాటలన్నీ చాలా తేలికగా వినిపించేవి. రానురాను అమల మెదడుమీద తీవ్రమైన దెబ్బతీశాయి. నోట మాట రానిదానిలా అచేతనంగా వుండిపోయింది.

అప్పుడే తల్లితండ్రీ పోయారు. పాపం అల్లారుముద్దుగా పెంచిన అన్నగార్కి అమల సమస్య తలనొప్పిగా మారిపోయింది.

అమల గురించి తెలిసిన వాళ్ళెవరూ పెళ్ళాడేందుకు ముందుకు రాలేదు. అన్న విశ్వనాథం ఆంధ్రదేశం మొత్తం గాలించి ఆఖరికి మిలిట్రీలో దిక్కూమొక్కూ లేకుండా వున్న భీమారావుని వెతికిపట్టుకుని పెళ్ళిపీటలమీద కూర్చోబెట్టాడు.

ఎందుకైనా మంచిదని విశ్వనాథం చెల్లెలిమీద వున్న కళంకాన్ని చెప్పేశాడు. భీమారావు బొత్తిగా చలించలేదు.

శోభనం గదిలో అమల భర్తతో జరిగిన విషయం చెప్పింది. అతను తేలికగా నవ్వేస్తూ నాకటువంటి విషయాలు వినే ఓపిక లేదు అమలా. పుట్టుకతో ఏకాకినని నాకు పిల్లనివ్వలేదు ఎవరూ. గంతకు తగ్గబొంతే అనుకో నీకోలా, నాకోలా మేలే జరిగింది అన్నాడు.

భీమారావు వెడల్పాటి ఛాతీ వెనుక సముద్రం అంత ఔన్నత్యం వుందనిపించింది అమలకి. భర్తతో హాయిగా అత్త లేకపోయినా అత్తారింటికి వెళ్ళిపోయింది.

మొదటి రెండు పురుళ్ళూ విశ్వనాథం ఇంట్లోనే వేడుకగా జరిగింది. మూడో పురుడు మిలిట్రీ హాస్పిటల్‌లో పోసుకుంది.

ఆకాశమంత ఔదార్యం, భూదేవంత ఓర్పూ, విశ్వం అంత విశాలహృదయం సముద్రపు లోతంత ప్రేమా ఇన్ని ఉన్నాయి భీమారావుకి. ఎటొచ్చీ ఎదురుగా వున్నంతవరకే. భార్యనుగానీ, పిల్లల్నిగానీ కనిపించినంతవరకే కళ్ళల్లో పెట్టుకుని రెప్పల్లా చూసుకుంటాడు. కనుమరుగైతే తలచుకుందుకు కూడా తట్టదేమో అనిపిస్తుంది.

రెండేళ్ళ క్రితం లడఖ్ కి ట్రాన్స్ఫరైంది భీమారావుకి. ఇప్పుడు దాదాపు ఇరవై ఏళ్ళ తర్వాత ఎదిగి చదువుకుంటున్న పిల్లలు కళ్ళముందు కదులుతుంటే దిక్కుతోచని దానిలా అమల 'పొరపాటుచేశానా?' అనుకుంటోంది.

భీమారావు ఉత్తర భారతం అంతా తిరిగాడు. నిలకడ లేని ఉద్యోగం అన్చెప్పి అమల పిల్లల్ని ముగ్గుర్నీ దగ్గరుంచుకుని చదువులు చెప్పించింది. సెలవలకు రావడం ఝామ్మంటూ సినిమాలకీ, షికార్లకీ తిప్పేయడం, పిల్లల్నీ, పెళ్ళాన్నీ అరచేత స్వర్గం ఇలా అనిపించేట్లు చేయడం భీమారావుకి అలవాటు.

పిల్లల్లో పిల్లవాడిగా, పెద్దల్లో పెద్దవాడిగా భీమారావు కలిసిపోతుంటే ఇంటా బయటా అతనంటే అందరికీ అభిమానమే మరి.

అమల వుండబట్టలేక అడిగింది. నా డబ్బుతో ఈ సంసారం ఈదుకు రాలేకుండా ఉన్నాను. నేను మీ భార్యను. ఈ పిల్లలు మీ పిల్లలు. మీరుకొద్దో గొప్పో డబ్బు పంపకపోతే ఎలా గడపగలం చెప్పండి.

భీమారావు భార్యవైపు జాలిగా చూశాదు 'మెట్రిక్యులేట్ని నేను. ఏదో దేవుడిదయ వల్ల అప్పట్లో ఈ ఉద్యోగం అయినా వచ్చింది. నాకు మాత్రం వుండదా చెప్పు. నిన్నూ పిల్లల్ని సుఖపెట్టాలని. నేనుకూడా భారం కాకుండా నా బ్రతుకు నేను బ్రతుకుతున్నాను. అందుకు సంతోషించు.

అమలకి అతని పరిస్థితి తెలుసు. అయినా ఎంతకాలం ఇలా? రోజులు గడుస్తుంటే పిల్లల చదువులకీ, అవసరాలకీ ఎక్కువే అవుతోంది. ఒంటరిగా జీవితంలో ఇన్నేళ్ళూ పోరాడుతూ వచ్చింది. కాలం వయసుమీద దెబ్బకొడుతోంది. తనవల్ల కావడం లేదు.

ఆరోజు యధాలాపంగా వారపత్రిక తిరగేసింది. పుస్తకం పట్టుకుంటే ఆ చివరనుంచి ఈ చివరిదాకా మొత్తం చదవకుండా

## భయం



ప్రియురాలి భయానికి కారణం తెలియక ధైర్యం చెప్పాడు కృష్ణ
"ప్రేమికులు లోకానికి భయపడకూడదు రాధా."
"బోడిలోకం! నా భయమంతా నా భర్త చూస్తాడేమోనని!"
అంటూ నాలుక్కర్చుకుంది రాధ.

—అలి (హైద్రాబాద్)

ఉండదు. వున్నట్లుండి ఆకర్షణీయమైన శీర్షిక మీద దృష్టిపడింది. అది చిన్నప్పటినుంచీ చూస్తున్నదే అయినా నిద్రించిన గతాన్ని తిరగతోడినట్లుగా ఉంది.

భీమారావు బుద్ధిమంతుడే. అయితేనేం బాధ్యతలకి దూరంగా పారిపోయే మగాడు. అమల దృష్టిలో అర్భకుడు. చేతకానివాడు, పిరికివాడు. ఆడది మగాడిని ప్రేమిస్తుంది కానీ పరిస్థితులకీ, బాధ్యతలకీ జడిసి పారిపోయేవాడిని ప్రేమించదు.

తనేం చేసిందనీ? ఓ చిన్న తప్పిదం తన బతుకుపట్ల ఇంత శాపంగా మారుతుందని తెలిస్తే అసలటువంటి పని చేయకనే పోయేది. తెలిసీ తెలియని వయసులో పరస్పరాకర్షణ అని సూత్రప్రాయంగా కూడా ఎరగని వయసులో సోముకి ప్రేమలేఖ రాయడం ఎంత తెలివితక్కువ పని? ఓ చిన్న సంఘటన ఇలా బతుకంతా వెంటాడి తరిమికొడుతుందని ఎరగదేతను. అందువల్లే కదా అఖండమైన అందచందాలున్నా ఏ ఒక్కరికీ పనికిరాకుండా పోయింది.

తన తండ్రి ఎంత మురిసిపోయేవాడు 'నా బంగారు తల్లికి ఏ డాక్టర్నో, ఇంజనీర్నో వెతికి పట్టుకుని రానవసరం లేదు. వాళ్ళే వస్తారు' అని. అటువంటిదికనీసం పిల్లలకీ తనకీ ఓ చిన్న సహాయం చేయలేని భీరువు భీమారావునెందుకు పెళ్ళాడింది?

మారుతున్న కాలంతోపాటు తనూ మార్పు కోరుకుంటోంది. మగ్గంలో కండీలా తన శ్రమ పిల్లలకీ, తనకీ గుర్తింపు లేకుండా పోయింది. అందుకే వరుడు కావాలి శీర్షికని అతి జాగ్రత్తగా చూసి ఓ ఉత్తరం భీమారావు పేర వ్రాసి పడేసింది. దానికి మూడోరోజే భీమారావు జవాబు రాశాడు.

ప్రియ అమలా...

నీకు నా శుభాశ్శీసులు. నా గురించి నీ అభిప్రాయం విని కొద్దిగా బాధపడిన మాట వాస్తవమే. కానీ నీ తరఫునుంచి ఆలోచిస్తే నీ కోరిక నాకు అనౌచిత్యంగా ఏమీ అనిపించడం లేదు. పిల్లలకీ, నీకూ కనీస అవసరాలు గుర్తించలేని వాజమ్మని. ఏం చేయను చెప్పు? నేను నా అసమర్ధతని నీముందుంచి నీ మనసు నావైపు తిప్పుకునే ప్రయత్నం చేయడం లేదు సుమా!

అమలా నీ కోసం పిల్లల కోసం ప్రభుత్వంతో దెబ్బలాడి పొలమూ, ఇళ్ళస్థలమూ ఏర్పాటుచేశాను. నేను మరో రెండేళ్ళలో రిటైర్ అయి వచ్చేస్తున్నాను. అప్పుడు నాకు పెన్షన్ వస్తుంది. వయసు సడలింపుతో మరో స్థిరమైన ఉద్యోగం వస్తుంది. అంతేకాక నా పిల్లలకి చదువుకున్నన్ని రోజులూ రిజర్వేషన్ సీటు దొరుకుతుంది. అయినా మీ మార్గానికి నేను అడ్డురాదలుచుకోలేదు. పిల్లలు నీకు ప్రతిబంధకాలు అనుకుంటే వాళ్ళని హాస్టల్స్‌లో చేర్పించు. నీకు నచ్చిన వరుడు దొరికిన వెంటనే జాబు రాయి. వీలు చూసుకుని వచ్చి నిన్ను ఆశీర్వదిస్తాను.

ఇక నా గురించి అంటావా? నీ మార్గం మంచిదిగా అనిపిస్తే నేనూ వధువు కావాలి అనే కాలమ్ వెతుక్కుంటాను.

ఇట్లు
నీ భీమారావ్

ఆ ఉత్తరం చదవగానే అమలకి రెక్కలు

వచ్చినట్లు అనిపించింది. ఇన్నాళ్ళూ తను ఊపిరి సలపని జైల్లో వున్నట్లు బాధపడింది. ఇప్పుడింక తనకి అడ్డులేదు.

పిల్లల్ని పిలిచింది. జరిగిన విషయాలు పిల్లలకి చెప్పింది అమల. పిల్లలు ముగ్గురూ ముసిముసిగా నవ్వుకున్నారు. తల్లిది 'కుర్రచేష్ట' అనుకున్నాడు పెద్దవాడు. రెండోవాడు 'జరిగినప్పుడు కదా' అని సరిపెట్టుకున్నాడు. ఎటొచ్చీ మూడువాడే తల్లి కొంగులో మొహం దూర్చి 'అమ్మా! నాకు నువ్వూ, నాన్నా ఇద్దరూ కావాలమ్మా' అన్నాడు బెంగగా.

అమల వారం వారం వారప్రతిక తెప్పిస్తోంది. ఆ శీర్షికలు మచ్చుకు ఇలా ఉన్నాయి.

**అమెరికాలో స్థిరపడిన యువకుడికి** అందమైన చదువుకున్న వధువు కావాలి. యువకుడికి ఇదివరకే వివాహమై భార్య మంచాన తీసుకుంటోంది.

లక్ష స్థిరాస్తి కలిగి అందమైన ఏభైఏళ్ళ వరుడికి వితంతువైన వధువు కావలెను. విడాకులు తీసుకున్న స్త్రీ అయినా ఫర్వాలేదు. పిల్లలు బంధాలు కారాదు. మొదటి భార్య పిల్లల్ని ప్రేమగా చూసుకునే స్త్రీ అయితే మరీ మంచిది.

ఇంటర్ పాసై స్వంత బిజినెస్ చేసుకుంటున్న నలభై ఆరేళ్ళ వరుడికి వధువు కావలెను. డిగ్రీ చదివినవారికి ప్రాధాన్యత. ఉద్యోగిని అయినట్లయితే వెంటనే సంప్రదించండి'

ఎన్ని వారాలు గడిచినా అమల కోరుకున్న సంబంధం ఒక్కటీ కనిపించలేదు. అమెరికాలో వున్న వ్యక్తికి భారతీయ స్త్రీమీద వున్న అపారమైన నమ్మకానికి జోహార్లు అర్పించాలనిపించింది అమలకి. జీవితాంతం సేవ చేసేందుకు రెండు లైసెన్స్ బిళ్ళల పేర శాశ్వతంగా నౌకరు దొరుకుతుంది.

తన పిల్లలకి తల్లి కావాలి కానీ, ఆమె పిల్లలు జీవితానికి అడ్డు రాకూడదు. మగాడా! నీకు నా ప్రణామాలు;

రామేశ్వరం వెళ్ళినా శనీశ్వరం తప్పదన్న

# వివస్త్రలకు ప్రవేశం



*'అక్టోబర్ ఫెస్ట్' జాతరకు హాజరయ్యే ప్రజలు విధిగా మ్యూనిచ్‌లోని 'కెసెచ్' బార్‌ని సందర్శిస్తారు. జాతర జరిగే దేశానికి 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న 'కెసెచ్' బార్‌కు సుమారు 300 సంవత్సరాల చరిత్ర వుంది. 1680 సంవత్సరంలో స్థాపించబడిన ఆ పావశాలలో ప్రవేశించేవారు విధిగా దుస్తులు విప్పేసి లోనికి వెళ్ళాల్సిందే!*

—శ్రీశారద

ట్లు పెళ్ళి అయినా ఉద్యోగంచేసే వాడికి ఎక్కడైతేనేం?

అమల కిటికీలోంచి చూస్తోంది. ఆరుబయట పిల్లలు క్రికెట్ ఆడుకుంటున్నారు. దాదాపు ఆరునెలలుగా వుత్తరాల్లో పెళ్ళికొడుకుల గురించి వ్రాస్తూనే ఉంది. ఏ పెళ్ళికొడుకూ తనకి నచ్చలేదని భీమారావుకి చెప్పుకుంటోంది.

భీమారావ్ కూడా ఈ మధ్య వెంటవెంటనే జవాబులు రాస్తున్నాడు. 'ఓరిమిగల ఎద్దుకి తేటనీరు అమలా! నిదానంగా ఆలోచించి మంచి భర్తని ఎన్నుకో' అని హితవాక్యాలు రాస్తున్నాడు.

కిటికీ దగ్గర కుర్చీ వేసుకుని దీర్ఘాలోచనలో మునిగిపోయింది. తనకెటువంటి వరుడు కావాలో అన్న ప్రశ్న పక్కకి పెట్టి తనవంటి వధువు ఎటువంటి వాళ్ళకి నచ్చుతుందో అని ఆ కోణం నుంచి ఆలోచించడం మొదలుపెట్టింది.

అందం, ఆకర్షణ రెండూ తగ్గిపోలేదు అయితేనేం ఇరవై సంవత్సరాల వైవాహిక జీవితానికి గుర్తుగా ముగ్గురు పిల్లలు పుట్టారు. తొలి ముద్దూ, తొలి కలయికా, కోరుకునే సగటు మగాడికి తను మైనస్ పాయింట్ కిందే లెక్క.

ఏ ఒక్క వరుడూ తనకెందుకు నచ్చలేదు.

చిన్నగా నవ్వుకుంది. పరిసరాల్నీ, కాలాన్నీ మరిచిపోయింది. బొత్తిగా అసూర్యంపశ్యలాగా మారిపోయి అందాల రాజకుమారుడి కోసం కలలు కంటోంది. వాస్తవానికి అద్దంలో చూసుకుంటే మురిపెం కాస్తా తీరిపోయింది.

చెంపలు జారిపోయాయి. కళ్ళకింద నల్లని గీతలు ఏర్పడ్డాయి. జుట్టు ఓ పక్కంతా నెరిసింది. అల్చిప్పల్లాంటి కళ్ళు వడలిపోయిన తామరరేకుల్లా వున్నాయి.

శరీరంలో పటుత్వం తప్పింది. తాను మధ్యాహ్నం వైపు పరిగెట్టే సూర్యుడిలాంటిది. మరో ఎనిమిదేళ్ళు గడిస్తే యాభై దాటుతాయి. కొడుకులకి పెళ్ళిళ్ళు కూడా అయిపోతాయి.

మరి?

అమల కళ్ళల్లో నీళ్ళు చేరుకున్నాయి. బ్రతుకులో బాగా అలిసిపోయింది. జీవన రేఖ గ్రాఫ్ పేపర్‌లాంటిదైతే ఆర్థిక పరిస్థితి ఎంతకీ అందని పాయింట్ దగ్గర అమలని వెక్కిస్తోంది.

పెరుగుతున్న ధరలు, పెరగని జీతాలు ఎదుగుతున్న పిల్లలూ, లెక్కకి మిక్కిలిగా అవసరాలు ఇవన్నీ ఓ చోట చేరి అమలకి విశ్రాంతి లేకుండా చేస్తున్నాయి. భీమారావు తోడుగా వుండివుంటే ఈ ఆరునెలలూ బుద్ధి పెడదోవన పడేది కాదేమో?

అతడేమో ఉత్తరాన, ఈమె దక్షిణాన.

ఒక్క క్షణం ఆగి ఆలోచించింది. తనకు సరియైన వరుడిక దొరకడా ఈ జన్మకి. మెరుపులాంటి ఆలోచన రాగానే సన్నని తీగలాంటి చిరునవ్వు పెదవులమీద అలా మెరిసి ఇలా మాయమైంది.

ఆమె కోరుకున్న వరుడు ఇప్పటికి దొరికాడు. అంతే భీమారావుకి ఉత్తరం వ్రాసి పోస్ట్ చేసింది.

అర్జంటుగా అందిన ఉత్తరం పట్టుకుని

మరీ అర్జంటుగా వచ్చాడు అతను. తండ్రిని చుట్టేసి పిల్లలు ఊపిరాడనీయడం లేదు.

అతన్ని బెడ్డింగూ, బ్రీఫ్ కేసూ కిందపెట్టనీయలేదు వాళ్ళు. ఆ ఇంట్లో అడుగుపెట్టేందుకు అతనికి సిగ్గుగా ఉంది. వస్తూనే గుమ్మానికి మామిడి తోరణాలూ, పసుపు రాయడం గమనించాడు.

నోటిదాకా వచ్చింది పిల్లల్ని అడిగి తెలుసుకోవాలని. పెద్దవాడు తనంత పొడుగున్నాడు. రెండోవాడు చెవుల వరకూ వచ్చాడు. మూడోవాడు భుజాల్ని తాకుతున్నాడు. వీళ్ళనా అడగడం? మీ అమ్మ మనువాడే మీ నాన్న అనగలడా తను?

అతని కళ్ళు చెమర్చాయి. భార్య ఇలా చేస్తుందని తెలిసే కంపల్సరీ రిటైర్‌మెంట్ తీసుకున్నాడు. అతనికి రావాల్సిన సొమ్ము అందజేసే సన్నాహంలో ఉన్నారు. అతన్ని హాయిగా డిశ్చార్జ్ చేశారు. ఈ విషయం అమలకి తెలియనీయలేదు. పిల్లల్ని తల్లీ దండ్రి ఉండికూడా అనాథల్ని చేయడం అతనికి నచ్చలేదు.

అమల సుఖంగా వెళ్ళిపోతే పిల్లలతో తానుంటాడు. ఇరవై ఏళ్ళు అమల చూసుకుంది. మరో ఇరవయ్యేళ్ళు తను చూసుకుంటే అంతే చాలు.

అమల సందడి విని వంటింట్లోంచి చేతులు తుడుచుకుంటూ వచ్చింది. మొహంనిండా పసుపు రాసుకుందేమో మహా కళగా కనిపించింది భీమారావుకి. అతని గుండెల్ని పిండేస్తున్నట్లు బాధపడుతున్నాడు. పైకి మాత్రం గంభీరంగా 'ఏం అమలా బాగున్నావా? పెళ్ళికొడుకేడి?' అని అడిగాడు.

అప్పటికి పిల్లలు తండ్రి పెట్టె తెరచి తమకోసం తెచ్చిన సామాను చూసుకునే హడావుడిలో పడిపోయారు.

అమల అతని ప్రశ్నకి జవాబు చెప్పలేదు. నిండుగా నవ్వింది. కాఫీగ్లాసు అందించింది.

అలా వెళ్ళి పెరట్లో పూలన్నీ కోసుకొచ్చి మాల కట్టింది. 'ఈ రోజే నా పెళ్ళి' అతను



కుతూహలంగా అడిగాడు.

'ఊ..' అంది రెప్పవాల్చి.

అతను బిక్కమొహం వేశాడు. వెంటనే సర్దుకున్నాడు. ఆమెకోసం తెచ్చిన పట్టుచీర అందించాడు. అమల మాటిమాటికీ టైమ్ చూసుకుంటోంది.

అతను స్నానం చేసి వచ్చాడు. గుమ్మంలో కూర్చుని రాబోయే పెళ్ళివారి గురించి ఎదురుచూస్తున్నాడు.

అమల చీర కట్టుకుని వచ్చి అతని కాళ్ళకి నమస్కారం చేసింది. అతని చూపులు ఆమె చూపులతో కలుసుకున్నాయి. 'ఇంకా రావడం లేదేమిటి?'

ఆమె మాల తీసుకుని సగం త్రుంచి జడలో తురుముకుంది. పిల్లలు అక్కడికి చేరుకుని తల్లికి తండ్రి తెచ్చిన వస్తువులు చూపిస్తున్నారు.

భీమారావు మనసు స్థిరంగా లేదు.

అమల అతని చేతికి స్వీట్ అందించింది. అతనది అయిష్టంగానే అందుకున్నాడు.

ఆమె నెమ్మదిగా చెప్పింది. చాలా సంబంధాలు చూశానని రాశాను కదా ఏ ఒక్కటీ నచ్చలేదండీ నాకు. నిదానంగా ఓర్మితో ఓ నిర్ణయానికి వస్తేగాని మనసు కుదుట బడలేదంటే నమ్మండి.

ధర్మేచ, అర్థేచ, కామేచ... అంటూ మీరన్న మాటలు నాచెవుల్లో రింగుమంటూంటే ఈ బంధం తెంపుకోవాలని చూస్తే నావల్ల అయిపోయే పనేనా ఇది. మేరేజస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్ అంటారు. సంబంధం సప్తపదీనం కదా... మీరు... మిమ్మల్ని మించిన వరుడు నాకెక్కడ దొరుకుతాడండీ. చాలీ అదృష్టం నాకు.. మీ గురించి చెప్పేందుకు భాష లేదండీ నా దగ్గర అంటూ అతన్ని పెనవేసుకుని ఘొల్లుమంది. భీమారావుకు దుఃఖం ఆగడం లేదు. అమల దూరం అయితే బ్రతకగల్గేవాడా తను?

కుక్కలు చింపిన విస్తరిలా అయిపోయేది సంసారం. అతని కళ్లల్లో నీళ్ళు ఆమె కన్నీళ్ళతో కలిసి పోతున్నాయి.

పిల్లలు నవ్వుతూ అన్నారు. 'మమ్మీ స్వీట్స్ మాకివ్వండి' 'మీరే తీసుకోండరా?' అమల విసుక్కుంది. అతని కౌగిట్లోంచి బయటికి రావాలని ఆమెకు లేదు. అతనికీ అంతే ఏ జన్మలోను విడిపోలేము అన్నంత గాఢంగా పెనవేసుకున్నాడు.

అక్కడి వాతావరణం మల్లెల సౌరభంలా మంచు కురిసిన రాత్రిలా... మమతల కోవెలలా కనిపిస్తోంది.

*

